పేదలకు 'ఆరోగ్య సురక్ష'

- ప్రారంభమైన ఇంటింటి సర్వే
- ప్రజల ఆరోగ్య సమస్యలు యాప్‌లో నమోదు
- శిబిరంలో వైద్యసేవలు అందించేలా చర్యలు



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా మహిళకు ఇంటి వద్దే రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



వెంకన్నపాలెంలో వృద్ధుడిని పరీక్షిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంపై దృష్టి సారిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది ప్రజారోగ్య రక్షణకు చర్యలు చేపడుతున్నారు. 'నాడు–నేడు'లో భాగంగా ప్రభుత్వాస్పత్రులు ఆధునికీకరించి, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజల ఇంటికే వెళ్లి వైద్యులు సేవలు అందించి ప్రశంసలు పొందుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. షుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. స్థానిక గంగవరం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వేను చురుగ్గా చేపట్టారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.



యాతపాలెంలో మహిళకు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల ఆరోగ్యానికి భరోసా

అక్కిరెడ్డిపాలెం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మిందిలో వైద్య సిబ్బందికి, సచివాలయ ఏఎన్‌ఎంలు, వార్డు వలంటీర్లకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్డు వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు సంయుక్తంగా ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరించాలని సూచించారు. ఎవరికైనా బీపీ, షుగర్, కంటి సంబంధిత వ్యాధులు, ఇతర ఆరోగ్యసమస్యలు ఉంటే వివరాలు నమోదు చేయాలన్నారు. రోగులకు వారంలో ఒక రోజు విచ్చేసే స్పెషలిస్ట్ డాక్టర్ ద్వారా వైద్యం అందించి నెలకు సరిపడా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహ్మద్ గౌస్, పోలవరపు శ్రీహరి, శాంతి కుమారి, చిట్టిబాబు, గుడివాడ ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



గంగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు అందిస్తున్న వైద్యాధికారులు వినయ్, రమేష్‌బాబు



మిందిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుడివాడ లతీష్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమం. సర్వే సమయంలో వ్యాధులు గుర్తించి, ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. ఈ నెల 30 నుంచి షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి స్థానికంగా వైద్యం అందించడంతో పాటు సర్వేలో గుర్తించిన రోగులందరికీ వైద్య శిబిరంలో చికిత్స అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ వినయ్, గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి

క్లుప్తంగా

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి, 45 సంవత్సరాల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులని, పదో తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324, 83090 03057 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గాజువాక తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీవల్లి

గాజువాక: గాజువాక మండల తహసీల్దార్‌గా టి.శ్రీవల్లి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆమె పద్మనాభం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గాజువాక తహసీల్దార్ పాల్‌కిరణ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కో–ఆర్డినేట్ సెక్షన్‌కు బదిలీ కావడంతో శ్రీవల్లిని ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కె.త్రినాధరావు సహా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె గాజువాక మండలంలోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దీన్‌దయాల్‌కు ఘన నివాళి



దీన్‌దయాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయకు ఆ పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన దీన దయాల్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ పాశ్చాత్య సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా, భారతీయ విలువలకు ప్రతిరూపంగా దీనదయాళ్ ఉపాధ్యాయ అందించిన సిద్ధాంతం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రోహిణి, జీలకర్ర రమణ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి నెల పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న దేవన్‌రెడ్డి

గాజువాక: గాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి నెల పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు జరిపించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నెలపండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, 59వ వార్డు కార్పొరేటర్ పూర్ణశ్రీ సురేష్, 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సమకూర్చిన చీరలను పేద మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు శివ, సింహాచలం నాయుడు, హరినాథ్, సత్యనారాయణ, కోటి పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో రామకృష్ణ

పెదగంట్యాడ: ప్రతీ పాఠశాలలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ సూచించారు. వినియోగదారులకు తమ హక్కులను తెలియజేసేందుకు ఇవి దోహదం చేస్తాయన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్స్యూమర్ క్లబ్‌ను గైడ్ టీచర్ మధుసూదనరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ కోసం చైతన్యం నింపేలా ప్రతీ పాఠశాలలో క్లబ్‌ల ఏర్పాటుకు సహకరిస్తున్నామన్నారు. అనంతరం క్లబ్ ఆవశ్యకత, నిర్వహణల గురించి వివరించారు. జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టం – 2019 పై పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కె.వి.ఎన్.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి పర్షోత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని గంగవరం, దిబ్బపాలెం మత్స్యకారుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలను బీజేపీ నాయకులు కోరారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రిని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, మండల అధ్యక్షుడు పేర్ల అప్పారావు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్వాసితులతో ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, ఇక్కడి మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మించాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేసి, గంగవరం గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలే దేశ ప్రగతికి ఆధారం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలే దేశ ఆర్థిక ప్రగతికి ఆధారమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతూ పోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 956వ రోజు సంస్థకు చెందిన ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, డీఎన్‌డబ్ల్యూ, టెలికాం, ఆర్ అండ్ డీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని కోరారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కు సంస్థను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

2న శిష్టకరణాల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న తోకాడ కల్యాణమండపంలో జరగనున్న శిష్టకరణాల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు పిలుపునిచ్చారు. సంతమామిడితోట కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనంలో ఓబీసీ సాధన, సేవా కార్యక్రమాల విస్తరణ, కల్యాణమండపం అభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో అధ్యక్షుడు గంగవరం గోపీ, ప్రతినిధులు డబ్బీరు గురునాధం, ఎం.శివాజీ పట్నాయక్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరా భారతి తదితరులు

అగనంపూడి: నకిలీ మందులు అరికట్టడంలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర అన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరా భారతి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ సరిత, ఎన్ఎస్ఎస్ పీవోసత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీ దృష్టికి కార్మికుల వేతనాల సమస్య



ఏడీసీ సన్యాసిరావును కలిసిన పారిశుధ్య కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: మిస్ అయిన జూన్ నెల జీతాలు చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ 68, 69 వార్డులకు చెందిన పారిశుధ్య కార్మికులు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటీలో ఏడీసీ డాక్టర్ సన్యాసిరావును కలిశారు. సోమవారం ఆయన నివాసం వద్ద పారిశుధ్య కార్మికులు కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందిన ఏడీసీ తప్పిన జీతాలు వారం రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తెలిపారు. నాయకులు గొలగాని అప్పారావు, లక్ష్మణరావు, అప్పన్న, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీపురం క్షేత్రంలో అమృత జయంతి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమృత జయంతి ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించేందుకు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ తెలిపారు. అమృతానంద సరస్వతి జయంతిని పురస్కరించుకొని పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. కన్యా వేద గురుకులం ప్రారంభించి ముందుకు తీసుకువెళ్లాలని గురుమాత అన్నపూర్ణమ్మ నిశ్చయించారని చెప్పారు.

క్యూసీ విజేతలకు అభినందనలు

ఉక్కునగరం: ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన క్వాలిటీ సర్కిల్స్ (క్యూసీ) పోటీల్లో బంగారు పతకం సాధించిన ఎల్‌ఎంఎంఎ ఉద్యోగులను విభాగాధిపతి ఎం. శ్రీనివాసప్రసాద్ అభినందించారు. విభాగం కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యూసీ, పని ప్రదేశ నిర్వహణ (ఫైవ్ ఎస్) సంస్థలకు చాలా ఉపయోగకరమన్నారు. ఉద్యోగులు అంకిత భావంతో చేసే ఇటువంటి కార్యక్రమాల వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జీఎం కె. రమేష్, అవార్డు గ్రహీతలు డి.వీరకేసరి, చంద్రకాంత్, బి.నాగరాజు, పి.సీతారామరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యారాడ బీచ్ క్లీనింగ్



యారాడ తీరాన్ని శుభ్రం చేసిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పెదగంట్యాడ: ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చైతన్య కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు యారాడ తీరంలో సోమవారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరంలో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించారు. అనంతరం స్ఫూర్తి అనాథ శ్రమంలోని బాలబాలికలకు స్నాక్స్ అందజేశారు. అనాథాశ్రమాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ యూనిట్–1, యూనిట్–2 జె.రాధ, వైవీఎస్ లక్ష్మి, యూనిట్–3 ఆఫీసర్ భాను ప్రసన్న పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ కార్యదర్శికి నివాళి



మృతునికి నివాళి అర్పిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఇటీవల మరణించిన స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి పాడుగు నాగేశ్వరరావుకు కార్మిక సంఘాల నాయకులు నివాళి అర్పించారు. స్టీల్ హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొని, నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మసేనురావు తదితరులు నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు దొమ్మేటి అప్పారావు, సన్యాసిరావు, జి. అప్పలరాజు, జగదీష్, డేవిడ్, డి.వి.రమణారెడ్డి, కె. శ్రీనివాస నాయుడు, నరేంద్ర, టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వివాదం

- ఫార్మసిస్ట్‌తో ఉద్యోగి వాగ్వాదం
- ఆస్పత్రి సీజీఎంకు ఫిర్యాదు




ఆస్పత్రి సీజీఎంకు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగి, నాయకులు


ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో డిస్పెన్సరీకి వచ్చిన ఉద్యోగి, ఫార్మసిస్ట్‌ల మధ్య మందుల గురించి వివాదం జరిగింది. ఆ వివాదం విభాగాధిపతి దృష్టికి వెళ్లడంతో చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. స్టీల్ డీటీయూ నాయకుడు కర్రా ప్రకాశరావు, ఎల్.వి. రమణ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్ డీటీయూ కార్యకర్త బాలభారత్ సోమవారం తన 7 నెలల బాబుకు జ్వరానికి చికిత్స కోసం పిల్లల వైద్యుడిని సంప్రదించారు. ఫార్మసీలో వైద్యుడు ప్రిస్క్రిప్షన్ రాసిన మందు కాకుండా వేరేది ఇచ్చారు. ఆ మందును చూసిన వైద్యుడు అది రాంగ్ మెడిసిన్ అని, దానివల్ల పిల్లల కిడ్నీలకు ప్రమాదం జరుగుతుందని తెలిపారు. ఆయన స్వయంగా ఫార్మసీకి ఫోన్ చేసి హెచ్చరించారు. ఉద్యోగి ఫార్మసీకి వెళ్లి ప్రశ్నించగా.. ఆ సమయంలో నువ్వు ఫోన్ మాట్లాడుతున్నందున కావాలనే అలా ఇచ్చానని ఫార్మసిస్ట్ సమాధానం ఇచ్చారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈలోగా నాయకులు ప్రవేశించి ఈ అంశంపై సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై తప్పకుండా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రతీ రూపం.. ప్రత్యేకం

- ఆకట్టుకుంటున్న గణనాథుడి విగ్రహాలు
- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



శాతవాహన నగర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



పాతకూర్మన్నపాలెంలో సాయినాథుడితో గణేశుడు



86వ వార్డు గౌరీనగర్‌లో పార్వతీ పరమేశ్వరుల ఆశీర్వాదం అందుకుంటున్న గణపతి



రాసాలమ్మ కాలనీలో అన్నదానంలో పాల్గొన్న దామా సుబ్బారావు


కూర్మన్నపాలెం: గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. విగ్రహాలు నెలకొల్పి ఇప్పటికే ఏడు రోజులు ముగియడంతో కొన్నిచోట్ల గణనాథుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తుండగా మరికొన్ని చోట్ల పూజలు కొనసాగుతున్నాయి.

- 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనను వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావుప్రారంభించారు.
- తిరుమల నగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ గణేష్ మండపం వద్ద దీపారాధన ఆకట్టుకుంది.
- గౌరీనగర్‌లో మండపం వద్ద గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

యంత్రాలను కాంట్రాక్టర్లకు అప్పగించవద్దని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్‌లో మెషీన్లను కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని విభాగం సిటూ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు విభాగాధిపతికి వినతిపత్రం అందజేశారు. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల యంత్రాలు పాడైపోతాయన్నారు. మెషీన్లు అప్పగించడం కాకుండా అదనంగా శాశ్వత కార్మికులను నియమించడం ద్వారా మరింత ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విభాగం కమిటీ నాయకులు ఎం.పెంటయ్య, జి. ల్యాంబర్ట్ డిమాండ్ చేశారు.

రహదారి గోతులమయం



దువ్వాడ నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే మార్గంలో రహదారి దుస్థితి

అగనంపూడి: జీవీఎంసీ 85, 88 వార్డుల మధ్య రహదారి గోతులమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాసాలమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో కోళ్ల ఫారం మలుపు వద్ద రోడ్డు మరీ అధ్వానంగా ఉంది. 20 అడుగుల రహదారిలో కేవలం పదడుగుల వెడల్పులో బీటీ రోడ్డు నిర్మించారు. రోడ్డుకిరువైపులా కోతకు గురవడంతో కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే ప్రయాణించగలుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారి విస్తరించి, పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.